సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 11 । అక్టోబర్ । 2024



ఆడ, మగ ఇద్దరూ సమానమే

ఆడ, మగ ఇద్దరూ సమానమేనని ఐసీడీఎస్ పీడీ .శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం 'బేటీ బచావో-బేటీ పడావో'లో భాగంగా సమావేశం నిర్వహించారు. -IIలో



కుర్రాళ్ల సెంచరీల జోరు

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కుర్రాళ్లు సెంచరీలతో చెలరేగుతున్నారు. మ్యాచులు హోరాహోరీగా సాగుతున్నాయి. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0/25.9

జిల్లాలో గురువారం 25.9 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏఆర్ అదనపు ఎస్పీగా రమణయ్య

కడప అర్బన్: జిల్లా ఏ.ఆర్ అదనపు ఎస్పీగా రమణయ్యను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తిరుపతిలో ఏఆర్ విభాగంలో డీఎస్పీగా పనిచేస్తున్న రమణయ్యకు పదోన్నతి కల్పిస్తూ కడప ఏఆర్ అదనపు ఎస్పీగా నియమించారు. ఇక్కడ ఏఆర్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఎస్.ఎస్.వి కృష్ణారావును ఇంటిలిజెన్స్ విభాగానికి బదిలీ చేశారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్: వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో గురువారం వర్షం కురిసింది. గోపవరంలో అత్యధికంగా 14.2 మి.మీ వర్షం కురువగా కొండాపురంలో 13.6, బద్వేల్‌లో 6.2 , ఖాజీపేట, అట్లూరులలో 4.8, ఒంటిమిట్ట, పెండ్లిమర్రిలలో 4.2, దువ్వూరు, కమలాపురంలో 3.2 , బి.కోడూరులో 3.8, సిద్దవటంలో 3, ప్రొద్దుటూరులో 2.2, కడపలో 2, బి.మఠం, వల్లూరులో 1.6 మి.మీ వర్షం కురిసింది.

ఐదేళ్ల డిగ్రీ కోర్సులలో నేరుగా ప్రవేశాలు

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్, ఫైన్‌ఆర్ట్స్, బీకాం ఆనర్స్ కోర్సులలో నేరుగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపులలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 12వ తేదీలోపు విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలోని సంచాలకుల కార్యాలయంలో అన్ని రకాల అర్హత పత్రాలతో హాజరుకావాలని సూచించారు. ఎం శశికుమార్ (ఎర్త్ సైన్స్-8985597928), రాజేష్ (బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ -90140 46537) వెంకటేష్ (ఫైన్‌ఆర్ట్స్ -90100 14304)ను సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్ శివశంకర్ తెలంగాణకు కేటాయింపు

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టర్ శివశంకర్ లోతేటిని తెలంగాణ రాష్ట్రానికి కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆంధ్ర, తెలంగాణ క్యాడర్ విభజనపై కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన సమయంలో అధికారులను ఏపీ, తెలంగాణలకు కేంద్రం సర్దుబాటు చేసింది. వివిధ కారణాలతో అక్కడి వారు ఇక్కడ, ఇక్కడి వారు అక్కడ పనిచేస్తున్నారు. విభజన సమయం నుంచి నానుతూ వచ్చిన అధికారుల కేటాయింపు అంశం ఎట్టకేలకు పరిష్కారమైంది. తెలంగాణ క్యాడర్‌కు చెందిన కడప కలెక్టర్ శివశంకర్ లోతేటిని ఆ రాష్ట్రానికి కేటాయించారు. ఆంధ్ర, తెలంగాణ క్యాడర్ ఐఏఎస్‌లు ఈనెల 16వ తేదీలోపు తమకు కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. దీంతో కలెక్టర్ శివశంకర్ కూడా రేపో, మాపో రిలీవ్ అయ్యే అవకాశాలు ఉన్నట్లు చెబుతున్నారు. జిల్లాకు రానున్న కొత్త కలెక్టర్ ఎవరన్న విషయం తెలియాల్సి ఉంది. కలెక్టర్‌గా శివశంకర్ లోతేటి జులై 6వ తేదీ బాధ్యతలు చేపట్టారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటున్న కలెక్టర్‌గా అనతికాలంలోనే పేరుతెచ్చుకున్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేకి గ్రహణం!

శ్రీ వెంకటేశ్వరస్వామి పాదపద్మాల చెంత ఉన్న తిరునగరికి.. శ్రీనివాసుని తొలిగడప కడప నుంచి ఫోర్‌లైన్ రోడ్డు (సూరత్-చెన్నై హైవేలో) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపన చేసి ఏడాది పూర్తయింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. 130 కి.మీ దూరం రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీన్నే గ్రీన్‌ఫీల్డ్ హైవేగా కేంద్రం గుర్తించింది. వైల్డ్‌లైఫ్ అనుమతులు ఇవ్వని నేపథ్యంలో ఈ రోడ్డు నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది.

- హైవేకి గడ్కరీ చేసిన శంకుస్థాపనకు ఏడాది పూర్తి
- కడప-రేణిగుంట రోడ్‌లో నిత్యం ప్రమాదాలే
- సూరత్-చెన్నై హైవేలో భాగమే కడప-రేణిగుంట రోడ్
- పనులకు అడ్డంకిగా కేంద్ర అటవీశాఖ అనుమతులు

రాజంపేట: శేషాచలం అటవీ ప్రాంతంలో పచ్చటి ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన ప్రయాణంను అందించనున్న గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు వైల్డ్‌లైఫ్ అనమతుల గ్రహణం పట్టుకుంది. గుజరాత్‌లోని సూరత్-చెన్నై మధ్య నిర్మితమవుతున్న జాతీయ రహదారిలో భాగమే కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవే. ఇప్పుడు ఈ రహదారికి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుంది. శంకుస్థాపన జరిగి ఏడాది అవుతున్నా ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు. ఇందుకు కారణం అటవీశాఖ అనుమతులు రాకపోవడమే. రూ. 2,350 కోట్ల పనులకు కేంద్ర అటవీశాఖ అనుమతులు అడ్డంకిగా మారాయన్న విమర్శలున్నాయి.



రోడ్డు ఇలా..

జిల్లా	దూరం
తిరుపతి	20కి.మీ
వైఎస్సార్, అన్నమయ్య	110 కి.మీ

అంచనా వ్యయం: రూ. 2,350 కోట్లు

ఫోర్‌లైన్ ఇలా...

- రేణిగుంట నుంచి కరకంబాడి, మామండూరు, బాలపల్లె, శెట్టిగుంట వరకు ఉన్న రహదారినే ఫోర్‌లైన్‌గా మార్చనున్నారు.
- రైల్వేకోడూరుకు ముందు భాగంలో బైపాస్ మార్గం ఏర్పాటు. ఇక్కడ నుంచి అయ్యపురెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, భాకరాపేట పడమర దిశగా ఫోర్ లైన్ వెళ్లనున్నది.

అనుమతుల కోసం ఎదురుచూపు ..

కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం కోసం వైల్డ్‌లైఫ్ (కేంద్ర అటవీ పర్యావరణ శాఖ) నుంచి అనుమతులు ఎప్పుడు వస్తాయా.. అని ఎదురు చూస్తున్నారు.

ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం అటవీ క్లియరెన్స్ ఇచ్చింది. ఈ మేరకు నైన్ కమిటీ సమావేశంలో ఆమోదం కలిగింది. మొదటిదశ అటవీశాఖ ప్రతిపాదనలు కేంద్రానికి వెళ్లాయి. అక్కడి నుంచి ఈ ప్రతిపాదనల నేపథ్యంలో కేంద్రబృందం పరిశీలన చేపడుతుంది. ఆ బృందం నివేదిక అనంతరం వైల్డ్ లైఫ్ అనుమతి లభించనున్నది.

తక్కువ వ్యవధిలోనే తిరుపతి..

కడప-రేణిగుంట ఎన్‌హెచ్ ఏర్పడిన తర్వాత తక్కువ వ్యవధిలో తిరుపతికి చేరుకునే పరిస్థితులు ఆవిష్కృతమవుతాయి. ఫలితంగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వేలాదిమంది ప్రసిద్ధి పుణ్య క్షేత్రమైన తిరుపతి, చెన్నై నగరాలకు వెళ్లే వారికి కడప-రేణిగుంట రహదారి ఎన్‌హెచ్ చేయడం వల్ల త్వరితగతిన గమ్యానికి చేరుకునే వీలు కలుగుతుంది.

భూసేకరణ జరిగిన ప్రాంతాలివే..

కడప, చింతకొమ్మలదిన్నె, సిద్దవటం, ఒంటిమిట్ట, నాగిరెడ్డిపల్లె , పాటూరు (నందలూరు), రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, శెట్టిగుంట (రైల్వేకోడూరు).

ఎంపీ మిథున్‌రెడ్డి కృషి..

కడప-రేణిగుంట నేషనల్ హైవే త్వరితగతిన నిర్మాణంకు వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి తన వంతుగా కృషి చేశారు. ఇందుకు ప్రధానంగా కేంద్రం తీసుకున్న ప్రాయర్టీలో కడప-రేణిగుంట ఎన్‌హెచ్‌ను చేర్చేలా విశ్వప్రయత్నాలు చేశారు. ఫలితంగా భూసేకరణతోపాటు, మరోవైపు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇప్పుడు అటవీ అనుమతులు ఇవ్వాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది.

ఒంటిమిట్ట, నందలూరుకు స్పెషల్ కనెక్టివిటీ అవసరం

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలైన నందలూరు, ఒంటిమిట్ట కేంద్రాలకు ఎన్‌హెచ్ నుంచి కనెక్టివిటీ రోడ్ (సర్వీసురోడ్డు) అవసరమని పలువురు భక్తులు కేంద్రాన్ని కోరుతున్నారు.

హైవే రాకతో తగ్గనున్న ట్రాఫిక్..

ప్రస్తుత కడప-రేణిగుంట హైవేలో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతోంది. ఈ మార్గం మీదుగా తిరుపతి, చెన్నై, ముంబాయి, హైదరాబాదు మధ్య రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం 17వేలకు పైగా వాహనాలు హైవేపై పరుగులు తీస్తున్నాయి. ఈ ట్రాఫిక్‌కు ప్రస్తుతం ఉన్న హైవే కెపాసిటీ సరిపోవడం లేదు. ఫలితంగా ప్రమాదాలు, ట్రాఫిక్ స్తంభించిపోవడం లాంటివి తరుచుగా జరుగుతున్నాయి.

సీమ జిల్లాలకు ముఖ్య రహదారిగా..

రాయలసీమ జిల్లాలకు ముఖ్య రహదారిగా ప్రాచుర్యం పొందిన ఈ రహదారిలో జాతీయ రహదారి పనులలో జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు చాలా వరకు భూసేకరణలో పరిహార అంశం వివాదంగానే ఉంది. బాధితులు ఇప్పటికీ కలెక్టర్‌ను, ప్రజాప్రతినిధులను కలిసి మొరపెట్టుకుంటున్నారు. కడప-రేణిగుంట హైవే నిర్మాణానికి రూ.4వేల కోట్లు కేటాయింపులు వివిధ పనుల రీత్యా కేటాయించింది. అయితే ప్రాజెక్టు వ్యయం మాత్రం రూ.2,350 కోట్లు కేటాయించారు. గత ఏడాది జూలైలో కేంద్ర మంత్రి గడ్కరీ శంకుస్థాపన చేశారు. అయితే పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.



అనుమతులు త్వరితగతిన ఇవ్వాలి



కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణ పనులకు వైల్డ్ లైఫ్ అనుమతులు త్వరగా ఇవ్వాలి. ప్రసిద్ధి చెందిన దేవాలయాలు ఒంటిమిట్ట, నందలూరులో ఉన్నందున కనెక్టివిటి రోడ్డు నిర్మించాలి.

– అరిగె మణి, అధ్యక్షుడు, అరిగె సేవా ట్రస్ట్, నందలూరు

హైవే నిర్మాణంలో జాప్యం తగదు



కేంద్రం వైల్డ్‌లైఫ్ అనుమతులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వీడాలి. ఇప్పటికే ఉన్న పాతరోడ్డు (డబుల్ లైన్)లో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. భారీ వాహనాల ట్రాఫిక్ అధికంగా ఉంది.

– లక్ష్మీప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేత, కువైట్

జయజయహే మహిషాసురమర్దిని



అమ్మవారిశాలలో మహిషాసురమర్దినిగా అమ్మవారు

ప్రొద్దుటూరు కల్చరల్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో 8వ రోజు గురువారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో మహిషాసురమర్దినీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. గుహలో మర్రి చెట్లు, అస్థిపంజరాలు, భూతాల బొమ్మలు, పాముల సెట్టింగ్ అందరిని ఆకట్టుకుంది. రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినీ దేవిగా అలంకరించారు. 43వేల గాజులతో అమ్మవారి శ్రీచక్రం సెట్టింగ్, దేవతా మూర్తులు, వారాహి అమ్మవారి సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

సమస్యల పరిష్కారానికే 'గ్రామోదయం'

కలెక్టర్ శివశంకర్

కలసపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువరామాపురం గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎగువ రామాపురం ఎస్సీ కాలనీలోని డ్రైనేజీ, అంగన్వాడీ కేంద్రం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు.ఎగువ రామాపురం ఎస్సీ కాలనీలో రోడ్డుపై నీరు నిలుస్తోందని, దానిని పరిష్కరించాలని కాలనీవాసులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అంగన్వాడీ కేంద్రంలోకి వెళ్లి చిన్నారులకు ప్రభుత్వం అందే పౌష్టికాహారం అందుతుందా లేదా ఆరా తీశారు. అంగన్వాడీ కేంద్రం బయట మురుగునీరు ఉండటంతో చిన్నారులు అనారోగ్యం బారిన పడతారని, మురుగునీటిని తొలగించాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు గ్రామంలో ప్రభుత్వ భూమిని గుర్తించి ఆ భూమిని రైతులకు కౌలుకు ఇచ్చి ఆ కౌలు డబ్బులతో హరితరాయబారులకు జీతాలు చెల్లించాలని ఆదేశించారు. నూతన పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరగా డిసెంబర్‌లో మంజూరు చేస్తామని పేర్కొన్నారు. జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, తహసీల్దారు మధురవాణి, ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి, ఎంఈఓ మస్తాన్‌వలి, ఏపీఓ శివశంకర్‌రెడ్డి, ఏపీఎం సుబ్బరాయుడు, ఈఓపీఆర్‌డీ మురారి, స్థానిక సర్పంచ్ వెంకటయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ లోతేటిశివశంకర్

గ్రామోదయం సమస్యలను పరిష్కరించాలి

కడప సెవెన్‌రోడ్స్: గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాలలో అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలను వేగవంతంగా పరిష్కరించినపుడే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాలు ఏర్పడతాయని, అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో గ్రామోదయం, నగరోదయం కార్యక్రమంపై క్షేత్ర స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్రామోదయం, నగరోదయం కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. గ్రామ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సీసీ రోడ్లు, మురికి కాలువలు తదితరాలపై ఆరా తీశారు. జిల్లాలో ఎక్కడ కూడా ప్రసవాల సమయంలో మాతృమరణాలు గాని, శిశు మరణాలు కానీ జరగరాదని చెప్పారు. ఈనెల 14వ తేదీ నుంచి పల్లె పండగ కార్యక్రమం ప్రారంభించబడుతుందని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడారు. జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, జల వనరుల శాఖ ఎస్ఈలు శ్రీనివాస్, మల్లికార్జునరెడ్డితోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశల శనగ



అన్నదాతను నడిపించేది ఆశే.. అన్నదాత శ్వాసకూడా ఆశే.. అవును.. ఖరీఫ్ మిగిల్చిన నష్టాలను తట్టుకుని.. కష్టాల కన్నీళ్లను దిగమింగుకుని రబీకి సిద్ధమయ్యేలా చేస్తోంది ఆ ఆశే.. వరుణుడు పలకరించడంతో జిల్లా రైతులు కోటి ఆశలతో రబీకి సిద్ధమవుతున్నారు. ప్రధాన పంటైన శనగ సాగుకు సమాయత్తమవుతున్నారు.

- రబీలో శనగసాగుకు సిద్ధమవుతున్న రైతులు
- విత్తనాల కోసం జోరుగా రిజిస్ట్రేషన్లు

కడప అగ్రికల్చర్: వ్యవసాయం ఓ జూదంలా మారింది. ఎప్పుడు లాభమొస్తుందో.. నష్టం ఎలా పలకరిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రైతుకు కష్టానికి తగ్గ ఫలితం దక్కాలంటే ప్రకృతి అనుకూలించాలి. సకాలంలో వర్షాలు కురిసి ఆశించిన మేర దిగుబడి రావాలి. ఆపై గిట్టుబాట ధర దక్కితేనే రైతు గట్టెక్కే పరిస్థితి. లేదంటే అప్పులే మూటగట్టుకోవాల్సి వస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ రైతుకు నష్టాలే మిగి ల్చింది. ఆరంభంలో ఆశాజనకంగా వర్షాలు పడ్డాయి. దీంతో అన్నదాతలు ఎన్నో ఆశలతో పంటల సాగును ఆరంభించారు. పంటలు సాగు చేసిన 40 రోజుల తరువాత వరుణుడు పూర్తిగా ముఖం చాటేశాడు. ఇంకేముంది సాగు చేసిన ఆరుతడి పంటలు కళ్లెదుటే ఎండిపోయి చివరికి పెట్టుబడి సాయం కూడా రాకుండా పోయింది. ఈ నష్టాలను పూడ్చుకోవాలని రైతులు కోటి ఆశలతో రబీ సీజన్‌కు సమాయత్తమవుతున్నారు.



కమలాపురం మండలం చిన్నచెప్పలి రైతు సేవాకేంద్రంలో శనగల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న రైతులు

రబీ సీజన్‌లో... జిల్లాలో ప్రస్తుత రబీ సీజన్‌లో శనగ విస్తారంగా సాగు కానుంది. సాగుకు ముందు వర్షాలు కూడా అనుకూలంగా మారటంతో శనగసాగుపై అన్నదాతలు కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్నారు. ఏటా జిల్లాలో అత్యధికంగా కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, పులివెందుల నియోజకవర్గాల పరిధిలో అత్యధిక విస్తీర్ణంలో శనగపంట సాగవుతోంది.

జిల్లాలో సాధారణ శనగ సాగు (ఎకరాల్లో): 2,05,652

జిల్లాకు కేటాయించిన విత్తనాలు (క్వింటాళ్లలో): 72,234

రిజిస్ట్రేషన్లు చేసుకున్న రైతుల సంఖ్య (ఇప్పటివరకు): 25,605

ముమ్మరంగా రిజిస్ట్రేషన్స్....

శనగ విత్తనాల కావాల్సిన రైతులు వారి వారి గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో ముమ్మరంగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌ను చేసుకుంటున్నారు. అధికారులడిగిన పత్రాలన్ని ఇచ్చి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఎకరాకు 40 కిలోల చొప్పున గరిష్టంగా ఐదు ఎకరాలకు రెండు క్వింటాళ్ల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ సబ్సిడీ పోను క్వింటాల్‌కు రైతుల వాటా కింద రూ. 7050 చొప్పున చెల్లించాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆయా రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలను తీసుకెళ్లనున్నారు.

పూర్తిస్థాయిలో వర్షం పడగానే...



నేను 12 ఎకరాల్లో శనగ పంటను సాగు చేస్తున్నాను. నాకు కావాల్సిన శనగ విత్తనాన్ని బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్‌ను రూ. 7100 పెట్టి కొనుగోలు చేశాను. సాగుకు సిద్ధంగా ఉన్నాను. వర్షం పూర్తిగా పడగానే పంటను సాగు చేస్తాను. –బాబురెడ్డి,పెద్దపసుపుల

విత్తనాలు సిద్ధం చేస్తున్నాం



జిల్లావ్యాప్తంగా శనగను ఎక్కువగా విత్తే ప్రాంతాల్లో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో విత్తనాల పంపిణీని ప్రారంభిస్తాం.

– నాగేశ్వర్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి



ఆధార్ సేవలకు విశేష స్పందన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జాతీయ తపాలా వారోత్సవాల్లో భాగంగా అంత్యోదయ దివస్ సందర్భంగా తపాలా శాఖ ఏర్పాటు చేసిన ఆధార్ సేవలకు విశేష స్పందన లభించినట్లు కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ రాజేష్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని అప్సర సర్కిల్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎల్ఐ డెవలప్‌మెంట్ మేనేజర్ మునాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని లయోలా పాలిటెక్నిక్ వద్ద గురువారం అనుమానాస్పద స్థితిలో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని స్థానికులు గుర్తించి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ జీవన్ గంగానాథ్ బాబుకు అప్పగించారు. తప్పిపోయిన బాలుడు పోలీస్ స్టేషన్‌లో ఉన్నాడని వాట్సాప్ గ్రూపులలో మెసేజ్‌లు రావడంతో తల్లిదండ్రులు చూసి స్టేషన్ వద్దకు వచ్చారు. దీంతో పోలీసులు ఆ బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

కుర్రాళ్ల సెంచరీల జోరు

- మూడు సెంచరీలు నమోదు
- డబుల్ సెంచరీ చేసిన తనీశ్వర్ టెండూల్కర్



తనీశ్వర్ టెండూల్కర్ చిత్తూరు, (206 పరుగులు)



మణిదీప్, చిత్తూరు (102 పరుగులు)



ప్రణవ్‌శ్రీరామ్, విశాఖ (103 పరుగులు)



హితేష్ సాయి, కడప (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కుర్రాళ్లు సెంచరీలతో చెలరేగుతున్నారు. గురువారం కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, ప్రకాశం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 90 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. జట్టులోని తనీశ్వర్ టెండూల్కర్ 250 బంతుల్లో 37 ఫోర్లతో 206 పరుగులు చేశాడు. ఈయనకు జతగా కె.వి.ఎస్. మణిదీప్ 102 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రకాశం బౌలర్లు లోకేష్ 2, దినేష్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కడపకు స్వల్ప ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, తూర్పుగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన తూర్పుగోదావరి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 38.3 ఓవర్లలో 151 పరుగుల వద్ద తూర్పుగోదావరి జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని కృష్ణసాకేత్‌రెడ్డి 37 పరుగులు చేశాడు. కడప బౌలర్ హితేష్ సాయి 5, ఆదిత్య 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 159 పరుగులు చేసింది. జట్టులోని యోగాంజనేయ 50, సాయికృష్ణచైతన్య 35 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్ తమన్ 3 వికెట్లు తీశాడు. కాగా తొలిరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 8 పరుగుల స్వల్ప ఆధిక్యంలో కొనసాగుతోంది.

విశాఖ బ్యాట్స్‌మన్ జోరు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 32.3 ఓవర్లలో 63 పరుగులకే కర్నూలు జట్టు ఆలౌట్ అయింది. జట్టులోని మోక్షజ్ఞరెడ్డి 27 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు వినోద్ 5, భానుస్వరూప్ 2, ప్రఖ్యాత్‌వర్మ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 58 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 295 పరుగులు చేసింది. జట్టులోని తమన్‌రెడ్డి 82 పరుగులు చేయగా, ప్రణవ్‌శ్రీరామ్ 103, విజయ్‌కుమార్ 78 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి విశాఖ జట్టు 232 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

– జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమ జోన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణే తమ లక్ష్యమని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. గురువారం జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ల ద్వారా ట్యాక్స్, ఇతర చలానాలు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకునేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. రాయలసీమ జోన్ పరిధిలో ఎక్కడెక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో వాటిని బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించి అవసరమైన చర్యలు చేపడతామన్నారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల సరిహద్దు అయిన గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో వాహనాల డ్రైవర్లకు విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన గదులను ఏర్పాటు చేసి స్టాప్ అండ్ వాష్ గో ను చేపడతామన్నారు. ఇప్పటికే స్థల అన్వేషణ జరుగుతోందన్నారు. జోన్ పరిధిలో కార్యాలయాలకు అవసరమైన మెటీరియల్ కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంవీఐ విజయ్ భాస్కర్, ఏఎంవీఐ లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ మృతి - కేసు నమోదు

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన మీనిగె చెంచు శ్రీనివాసులు(57) అనే ఫొటోగ్రాఫర్ మృతిపై భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. శ్రీనివాసులు పోరుమామిళ్ల పట్టణంలో 30 ఏళ్లుగా ఫొటోగ్రాఫర్ వృత్తి చేస్తున్నారు. 25 ఏళ్ల క్రితం వనితతో వివాహమైంది. వారికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. ఇరువురి మధ్య మనస్పర్థలు రావడంతో 13 ఏళ్ల క్రితం విడిపోయారు. శ్రీనివాసులు ఒంటరిగా ఉంటున్నాడు. భార్య వనిత పిల్లలతో హైదరాబాదులో ఉంటోంది. ఈనెల 6న పిల్లలు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. రెండు రోజులుగా ఫోన్ ఎత్తకపోవడంతో 9 వ తేదీన భార్యా పిల్లలు పోరుమామిళ్ల వచ్చారు. ఇంటికి లోపల వైపు గడియ పెట్టి ఉండటం, దుర్వాసన వస్తుండటంతో అనుమానం వచ్చి బంధువులు, పోలీసుల సహాయంతో తలుపు పగుల కొట్టి లోపలకు వెళ్లి చూశారు. టాయ్‌లెట్‌లో దుస్తులు లేకుండా బోర్లాపడి చనిపోయి ఉండటాన్ని గమనించారు. అప్పటికే పురుగులు పట్టాయని, భరించలేని దుర్వాసన వస్తోందని ఎస్ఐ తెలిపారు. లోపల గడియ పెట్టుకుని ఉండటం వల్ల మృతిపై అనుమానాలు లేవన్నారు. అయితే భార్య వనిత భర్త మృతిపై అనుమానం వ్యక్తం చేయడంతో ఆమె ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

రైలు కింద పడి యువకుడి మృతి

అట్లూరు : మండల పరిధిలోని వేమలూరు ఎస్సీ కాలనీకి చెందిన నడివీధి నవీన్(20) అనే యువకుడు బుధవారం రాత్రి రైలు కింద పడి మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు బ్రహ్మయ్య, ఈశ్వరమ్మలకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఒక్కగానొక్క కుమారుడు నవీన్ కడపలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ ఉన్నాడు. అయితే అతను బుధవారం రాత్రి కనుమలోపల్లి దగ్గర రైలు కింద పడి మృతి చెందినట్లు సమాచారం రావడంతో హుటాహుటిన బయలుదేరి వెళ్లారు. గురువారం కడప రిమ్స్‌లో పోస్టుమార్టం అనంతరం వేమలూరు ఎస్సీ కాలనీకి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఎమ్మెల్యే పరామర్శ : వేమలూరు ఎస్సీ కాలనీకి చెందిన నవీన్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా గురువారం ఉదయం రిమ్స్ మార్చురీలో ఉన్న మృతదేహాన్ని సందర్శించి మృతుని బంధువులను ఓదార్చారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముడమాల ప్రభాకర్‌రెడ్డి, వేమలూరు ఉప సర్పంచ్ మునెయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని జాతీయ రహదారిపై సుగాలి బిడికి గ్రామం వద్ద కడప నుంచి రాయచోటి వైపు వెళుతున్న ఆల్విన్ (ఏపీ 39యుఎన్ 8922) వాహనం ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కగా ఆగి ఉన్న పాల వ్యాను (ఏపీ39యుసీ 5323)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పాల వ్యాన్ రోడ్డుకు అడ్డంగా పడడంతో రాయచోటి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఆల్విన్ డ్రైవర్ సన్నీకి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రక్షక్ వాహన సిబ్బంది స్థానికుల సహకారంతో గాయపడిన డ్రైవర్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. సీకే దిన్నె పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ డ్రైవర్‌కు మూడేళ్ల జైలు శిక్ష

వేముల : మండలంలోని పులివెందుల - కడప ప్రధాన రహదారిలో గల చాగలేరు క్రాస్ వద్ద 2017 నవంబర్ 15వ తేదీన రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వేల్పుల గ్రామానికి చెందిన వల్లూరు చంద్రకేశవ మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అప్పటి ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి లారీ డ్రైవర్ మునిస్వామి సెంథిల్‌ను అరెస్టు చేసి చార్జీషీట్ ఫైల్ చేశారు. ఈ కేసులో సాక్ష్యాలను విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో లారీ డ్రైవర్ మునిస్వామి సెంథిల్‌కు పులివెందుల ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్‌రెడ్డి మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ.6వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కడప అర్బన్ : కడప రిమ్స్‌లో ఈనెల 8వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి వెంకట రమణ(57) పేరుతో చికిత్స కోసం చేరాడు. అదే రోజు సాయంత్రం మృతి చెందాడు. ఎవరైనా అతని బంధువులు ఉంటే తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

తూకాల్లో మోసం చేస్తే కేసు నమోదు చేస్తాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని జిల్లా తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్ర రెడ్డి హెచ్చరించారు. గురువారం నగరంలోని ఫర్టిలైజర్, బియ్యం దుకాణాలను, ఆటోమొబైల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

– జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

వల్లూరు : ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపడతామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. గ్రామోదయం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన వల్లూరులో గురువారం ఉదయం ఆమె మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె అధికారులతో కలిసి గ్రామంలోని వీధుల గుండా నడుస్తూ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, ఎస్‌డబ్ల్యూపీసీని తనిఖీ చేశారు. వాటిలో జరిగే యాక్టివిటీస్ గురించి ఆరా తీశారు. ప్రజలతో స్వయంగా మాట్లాడి గ్రామంలోని రోడ్లు, తాగు నీటి సరఫరా, విద్యుత్, హౌసింగ్ మొదలైన అంశాలలో సమస్యలను తెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, మండల స్పెషలాఫీసర్ క్రిష్ణకిశోర్, తహసీల్దార్ శ్రీవాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ



స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్‌లో గురువారం విశ్వం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్‌ను ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రామచంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య, మధ్య తరగతి విద్యార్థులకు నవోదయ, సైనిక విద్యాలయాలు వరమని పేర్కొన్నారు. విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ 34 ఏళ్లుగా సైనిక్ ఫలితాల్లో 41 రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులతో పాటు 910 సీట్లు సాధించి, కోచింగ్ చరిత్రలో రికార్డు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, అపుస్మా రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సేవించే వారిపై డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించిన ప్రాంతం

కడప అర్బన్ : గంజాయి నిర్మూలనకు జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నగరంలో గంజాయి సేవనం జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలలో అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో నిఘా ఉంచేలా చర్యలు చేపట్టారు. మరోవైపు కొరియర్ కార్యాలయాలు, గోడౌన్ లలో డిస్ట్రిక్ట్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డి.ఎన్.సి.సి) ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గంజాయి వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం

డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, ఆందోళన వల్ల చిన్న వయస్సులోనే అధిక రక్తపోటు, మధుమేహం, గుండెపోటు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యను యోగా, శారీరక వ్యాయామం, సమయ పాలన ద్వారా అధిగమించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా మానసిక ఆరోగ్య వైద్య నిపుణురాలు డాక్టర్ కవిత ప్రసన్న మాట్లాడుతూ ఉద్యోగులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారన్నారు. దీనివల్ల వారు పనిచేసే సామర్థ్యంతోపాటు ఉత్పాదకత దెబ్బతింటుందని తెలిపారు. ఒత్తిడి, మానసిక రుగ్మతలను తొలి దశలోనే గుర్తించి కౌన్సిలింగ్, సరైన వైద్యం ద్వారా నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్, డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీఎల్ఏటీఓ డాక్టర్ రవిబాబు, అర్బన్ హెల్త్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఓబెదుల్లా, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు

ఆడపిల్లలపై వివక్ష తగదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక కార్యాలయ మీటింగ్ హాలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలకు ఆడపిల్లలను కాపాడండి అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష ఎంతమాత్రం తగదన్నారు. ఆడపిల్లల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమామహేశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల దరఖాస్తు గడువు పెంపు



మాట్లాడుతున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 9 వరకు ఉన్న గడువును 11 వరకు పొడిగించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. గురువారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాలు ఈనెల 15 వరకు నడుస్తాయన్నారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దరఖాస్తుదారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ తీస్తామన్నారు. 16 నుంచి లాటరీ ద్వారా మద్యం దుకాణాలు పొందిన వారు నడుపుకోవచ్చన్నారు. గిగిగి.జి ఇజట ఇట్బ్చిట్టి.ఛౌఝ వెబ్ సైట్ ద్వారా ఎక్కడి నుంచైనా సులభతరంగా దరఖాస్తు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. దరఖాస్తుదారులు 14 తేదీ ఉదయం 7 గంటలకు కడప జెడ్పీ వద్దకు ఎంట్రీ పాసులతో పాటు తగిన ఐడీ కార్డు తీసుకొని రావాలన్నారు. జిల్లాలో మొత్తం 2225 దరఖాస్తులు రాగా ఇందులో కడప-491, సిద్దవటం-80, ప్రొద్దుటూరు-438, జమ్మలమడుగు-103, మైదుకూరు-247, బద్వేలు-330, ఎర్రగుంట్ల-163, పులివెందుల-290, ముద్దనూరు-83 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, అసిస్టెంట్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఆడ, మగ ఇద్దరూ సమానమే

ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆడ, మగ ఇద్దరూ సమానమేనని స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశాల మేరకు మిషన్ శక్తి పథకం ద్వారా అమలు చేస్తున్న బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ మీటింగ్ హాలులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ 30 ఏళ్ల క్రితం ఆడపిల్లలు పుడుతూనే తల్లిదండ్రులు బాధపడేవారన్నారు. ఇప్పుడు మహిళలు అవగాహన కలిగి తన లాగా తన కుమార్తె కాకూడదన్న సంకల్పంతో వారిని మగ పిల్లలతో సమానంగా చదివిస్తున్నారన్నారు. సీడీపీఓలు సునంద, సునీత, అరుణకుమారి, శ్రీలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సురేష్‌యాదవ్, వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ అశ్విని, మహిళా పోలీసులు, సూపర్‌వైజరు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

పులివెందుల రూరల్ : పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం పులివెందుల మండలం ఎర్రబల్లె, హరిజనవాడ ప్రాంతాల్లో గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ముందుజాగ్రత్త చర్యగా మురుగునీటి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఎంపీడీఓ రామాంజనేయులు, ఎంపీపీ వరలక్ష్మి పాల్గొన్నారు.

బజాజ్ వాహనాలకు విశేష స్పందన

– కొనుగోలుకు క్యాష్‌బ్యాక్ సౌకర్యం



కొనుగోలుదారునికి వాహనాన్ని అందజేస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా శరన్నవరాత్రుల సందర్భంగా బజాజ్ వాహనాల విక్రయాలకు సంబంధించి ప్రజలనుంచి విశేష స్పందన లభిస్తోందని హరూన్ బజాజ్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మాట్లాడుతూ నవరాత్రులు ప్రారంభమైనప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా 600 వాహనాలు విక్రయాలు జరిగాయన్నారు. ముఖ్యంగా పల్సర్ 125 బైక్‌తోపాటు కొత్తగా వచ్చిన వాహనాలకు అడ్వాన్స్ బుకింగ్ జరుగుతోందన్నారు. అలాగే మేళాలో ఒక్కరోజే 128 వాహనాలు అడ్వాన్స్ బుకింగ్ జరిగిందని, చేతక్ వాహనాలు 30 వాహనాలు, సీఎంజీ ఫ్రీడమ్ వెహికల్ 30 వరకు విక్రయించామన్నారు. పండుగ సందర్భంగా వాహనదారులకు రూ.16 వేలు ఆదా అవుతుందని, అలాగే రూ.10 వేల క్యాష్‌బ్యాక్ సౌకర్యం ఉందన్నారు. వాహన కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వైవీయూ రిజిస్ట్రార్ రాంప్రసాద్‌రెడ్డిని తొలగించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ తప్పెట రాంప్రసాద్ రెడ్డిని ఆ బాధ్యతల నుంచి తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2011 సంవత్సరంలో ఒక మహిళా పీహెచ్‌డీ స్కాలర్‌ను లైంగిక వేధింపులకు గురి చేశారనే ఆరోపణలపై అప్పట్లో విచారణ జరిపిన కమిటీ ఆ సంఘటన నిజమేనని నిర్ధారించిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్ తదితరులు పాల్గొన్నారు.